భక్తుల కొంగు బంగారం పోలేరమ్మ

కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా పేరు పొందిన నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ 49వ జాతర మహోత్సవాలు ఈ నెల 26వ తేదీన ఘటోత్సవం ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవదాయ శాఖ అధికారులు, స్థానిక పెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ జాతరను 90 ఏళ్ల క్రితం వెంకటగిరి రాజాల పాలనలో అప్పటి విన్నమాల మజరాలో హవల్దార్‌గా పనిచేసిన నల్ల బోతుల వెంకయ్య మొదలు పెట్టినట్టు పెద్దలు చెబుతున్నారు.

– నాయుడుపేట టౌన్

- 26 నుంచి జాతర
- ఘనంగా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు


పోలేరమ్మ ఆలయంలో ప్రతిష్ఠితమైన పోలేరమ్మ, పోతురాజు


విశేషాలంకరణలో పోలేరమ్మ(ఫైల్)

చిన్న గ్రామంగా ఉన్న నాయుడుపేటలో అనేక మందికి అమ్మతల్లి పోసి అస్వస్థతకు గురయ్యారు. గ్రామస్తులు అంకాళమ్మ ఆలయం వద్ద పూజలు చేయడంతో కొంతమందికి అమ్మవారు పూనింది. గ్రామంలో పోలేరమ్మను ప్రతిష్ఠించి పూజలు చేస్తే మంచి జరుగుతుందని చెప్పింది. గ్రామస్తులు పోలేరమ్మ మట్టి ప్రతిమను చేసి జాతర నిర్వహించారు. దీంతో గ్రామంలో వ్యాధులు పోయి అందరూ సుఖంగా జీవించడం మొదలు పెట్టారు. అప్పటి నుంచి ప్రతి ఏటా జాతర చేస్తున్నారు. అప్పట్లో విన్నమాల మజరాగా పిలవబడే నాయుడుపేట, ఎల్‌ఏసాగరం, విన్నమాలకు చెందిన పెద కాపులతోపాటు అన్ని వర్గాలకు చెందిన వారు కలిసి జాతరను నిర్వహించేవారు. తదనంతర కాలంలో నాయుడుపేటకు చెందిన నల్లబోతుల నాగరత్నం చొరవతో కొండా రాజగోపాల్‌శెట్టి కుటుంబీకులు, డాక్టర్ మోహన్ కృష్ణ తదితరులు గడియారం సెంటర్ వద్ద గ్రామ దేవత పోలేరమ్మ, పోతురాజు ప్రతిమలను ప్రతిష్ఠించి జాతర నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. నాటి నుంచి అక్కడ జాతర నిర్వహిస్తున్నారు. గతంలో జాతర కమిటీలో వివాదాలు చెలరేగి పోలేరమ్మ ఆలయ నిర్వహణ బాధ్యతలను 8 ఏళ్ల కిందట దేవదాయశాఖకు అప్పగించారు. నాటి నుంచి జాతరను పూర్వీకులు ఎలా నిర్వహించేవారో అలాగే అధికారులు నిర్వహిస్తున్నారు. పోలేరమ్మ జాతరకు అప్పట్లో వెంకటగిరి రాజాలు అందించిన పాదుకలు, హస్తాలతోపాటు దాతలు సమర్పించే ఆభరణాలతో అమ్మవారికి అలంకరణ చేయడం ఆనవాయతీగా వస్తోంది.

ఘనంగా ఏర్పాట్లు



నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ జాతరను మూడురోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పూర్వీకులు చేసే విధంగానే దేవదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జాతరను నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు పోలేరమ్మ ఆలయ నిధులను ఖర్చుచేస్తున్నాం. భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- ఎ.శశాంక్, ఈవో, నాయుడుపేట

48 ఏళ్లుగా జాతరను నిర్వహిస్తున్నాం



విన్నమాల మజరాగా పిలవబడే నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ జాతరను ప్రతిఏటా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది కూడా అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవదాయశాఖ, పోలీసు అధికారులు సహకరిస్తున్నారు. జాతరలో కీలక ఘట్టమైన అమ్మవారి నిమజ్జనాన్ని కట్టుదిట్టంగా నిర్వహించేలా చర్యలు చేపడుతున్నాం.

- అరవభూమి శ్రీనివాసులురెడ్డి, విన్నమాల పెదకాపు

పోతురాజు, పోలేరమ్మకు ప్రత్యేక అలంకరణ



నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ జాతర సందర్భంగా పోలేరమ్మ, పోతురాజుకు విశేష అలంకరణలు చేస్తాం. ఈనెల 26న ఘటోత్సవం, 28వ తేదీ రాత్రి అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయం వద్ద నిలుపుతాం. 29 ఉదయం నుంచి రాత్రి వరకు దర్శనం ఉంటుంది. అనంతరం ఊరేగింపు నిమ్మజ్జనం చేపడతాం. భక్తులు వేలాదిగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

- రాయపూడి మునిసురేష్, ఆలయ అర్చకులు

క్లుప్తంగా

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు


ప్రజలతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరెడ్డి

నాయుడుపేట టౌన్ : ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎక్కడైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఆయన రెండు రోజులుగా సమస్యాత్మక గ్రామాల్లో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడారు. కౌంటింగ్ జరిగే రోజు ఎక్కడా గొడవలకు దిగరాదని సూచించారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయి, ఎన్నికల కోడ్ ముగిసే వరకు నాయుడుపేటతో పాటు గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నాయకులు రెచ్చగొట్టే ధోరణిని అవలంబించరాదన్నారు. అనంతరం గొడవలకు వెళ్లమని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్‌ఐ గోపీ కూడా మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలను సమావేశ పరిచి ముందస్తు హెచ్చరికలు చేస్తున్నారు.

ఎన్‌బీకేఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్


జేఎన్‌టీయూఏ నుంచి డాక్టరేట్ అందుకున్న నాగార్జున్‌రెడ్డి

కోట : విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ ఈసీఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న జి.నాగార్జున్‌రెడ్డికి అనంతపురం జేఎన్‌టీయూ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయన ఆప్టిమైజ్డ్ డీప్ లెర్నింగ్ ఫ్రమ్ వర్క్ ఫర్ ఎర్లీ డయాగ్నసిస్ ఆఫ్ అల్జీమర్స్ డిసీజ్ అనే అంశంపై పరిశోధన చేశారు. ఆయనను కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఈసీఈ హెచ్‌వోడీ హరనాథ్‌రెడ్డి అభినందించారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన పదో తరగతి ప్రశ్న పత్రాలు


ప్రశ్నపత్రాలను పెట్టెల్లో భద్రపరుస్తున్న అధికారులు

నాయుడుపేట టౌన్ : ఈ నెల 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ఈ క్రమంలో ప్రశ్నపత్రాలు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరాయి. వాటిని పరీక్ష కేంద్రాల చీఫ్‌లు పెట్టెల్లో భద్రపరిచి పోలీస్ స్టేషన్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ఎల్‌ఏ సాగరం ఉన్నత పాఠశాల, నారాయణ పాఠశాలలో పరీక్షలు జరుగుతాయని, 600 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్టు ఆయా సెంటర్ల చీఫ్‌లు శ్రీనివాసులు, అన్నామణి , నర్సింహరావు తెలిపారు.

పేదలకు ఫల సరుకులు పంపిణీ



గూడూరు రూరల్ : గూడూరు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం 20 మంది పేదలకు నెలకు సరిపడా ఫల సరుకులు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు సనత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతినెలా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే రోటరీ క్లబ్ సభ్యుడు నాగరాజు మనుమడు చైతన్‌విక్రాంక్ పుట్టిన రోజును పురస్కరించుకుని 20 మంది పేదలకు నెలకు సరిపడా ఫలసరుకులు అందజేసినట్టు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ సభ్యులు చిరంజీవి, నాశిన నాగులు, ధనుంజయరెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, డీవీ సుబ్రమణ్యం, టి.శ్రీనివాసులు, ఎస్‌ఎల్‌ఎన్ బాబు, గిరిబాబు, పి.రామ్మోహన్, ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మళ్లీ ప్రభంజనం సృష్టించనుంది


మంత్రి పెద్దిరెడ్డికి మొక్క అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేట టౌన్/పెళ్లకూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రభంజనం సృష్టించనుందని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమని ఆ పార్టీ సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్య తెలిపారు. ఆయన సోమవారం డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశారు. ఆయనకు మొక్కతోపాటు పుష్పగుచ్ఛం అందజేశారు. వారు మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో నాయకులు కలిసికట్టుగా పార్టీ విజయానికి పనిచేసినట్టు వివరించారు. మంత్రిని కలిసిన వారిలో నాయుడుపేట, పెళ్లకూరు ఎంపీపీలు ధనలక్ష్మి, పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, పెళ్లకూరు జెడ్పీటీసీ ప్రిస్కిల్లా, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి రత్నశ్రీ, నాయకులు కొండూరు రామకృష్ణంరాజు, ధారా రవి, గంధవళ్లి సిద్ధయ్య, పాలేటి నాగార్జున, చిందేటి వెంకటేశ్వర్లు, ఓడూరు వినోద్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా ధ్వజారోహణం


లక్ష్మీనరసింహస్వామికి తిరుచ్చి ఉత్సవం


ధ్వజారోహణం చేస్తున్న వేద పండితులు

చిల్లకూరు : మండలంలోని కలవకొండలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండవ రోజు సోమవారం ధ్వజారోహణం చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు తిరుచ్చి ఉత్సవాన్ని నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామి, అమ్మవార్లను మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అభిషేకాలు, అర్చనలు చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం లఘు పూర్ణాహుతి చేపట్టారు. తదనంతరం వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య ధ్వజారోహణం చేపట్టారు. తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాలకు మడమనూరుకు చెందిన చేవూరు శేషయ్య, పవిత్ర, ఆలయ అర్చకులు పెరంబుదూరు చిరంజీవి, వాసవి ఉభయకర్తలుగా వ్యవహరించారు. సాయంత్రం శేష వాహన సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలవకొండ సర్పంచ్ ఉడతా సుబాషిణి, శ్రీనివాసులు, నెల్లూరు అచ్చయ్య, మంగమ్మ, ఉడతా వెంకటేశ్వర్లు, విజయమ్మ ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ నిర్మాణ స్ఫూర్తి ప్రదాత యరటపల్లి జానకిరామిరెడ్డి, ఆలయ ఈవో తాతా శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

రాష్ట్రంలో మళ్లీ సంక్షేమ రాజ్యమే


మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు : రాష్ట్రంలో పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతోనే సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగిందని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఆయన సోమవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సారి జగనన్న అనుకున్న లక్ష్యం మేరకు రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించనుందన్నారు. తిరుపతి జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో తమ పార్టీ అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలవనున్నారని తెలిపారు. వెంకటగిరిలో అన్నింటికంటే మెజార్టీ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో సారి ముఖ్యమంత్రిగా జూన్ 9న విశాఖపట్నంలో ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో నేతలు కొడవలూరు దామోదర్‌రెడ్డి, రౌతు రామకృష్ణ, దువ్వూరు శేషారెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఏనుగు సుధాకర్‌నాయుడు, గూడూరు సుధాకర్‌రెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, పెళ్లూరు కోటేశ్వరరెడ్డి, వాకాటి రవి, గూడూరు వెంకటేశ్వర్లురెడ్డి, పీ.కృష్ణారెడ్డి, వాటంగారి వెంకటరమణయ్య, మధు యాదవ్, బూదనం వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

సుబ్రమణ్యస్వామి సేవలో నేదురుమల్లి


నేదురుమల్లికి స్వామివారి చిత్ర పటం అందజేస్తున్న సాయిరెడ్డి, శేషారెడ్డి

చిట్టమూరు(చిల్లకూరు) : మండలంలోని మల్లాంలో వెలసిన వల్లీ దేవసేన సమేత సుబ్రమణేశ్వరస్వామిని సోమవారం వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ చిల్లకూరు సాయిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు దువ్వూరు శేషారెడ్డి స్వాగతం పలికారు. నేదురుమల్లి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు స్వామి వారి చిత్ర పటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పును మంచి పాలనకు అందించేలా దీవించారని, వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి రెండోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారని తెలిపారు. అనంతరం ఆయన వైఎస్సార్ సీపీ నాయకులతో మాట్లాడారు.

పశువైద్యశాల భవనం ఆక్రమణపై ఫిర్యాదు


తహసీల్దార్ ప్రసాద్‌రావుకు ఫిర్యాదు చేస్తున్న పెరుమాళ్లపల్లి గ్రామస్తులు

పెళ్లకూరు: మండలంలోని పెరుమాళ్లపల్లిలో ఉన్న పశువైద్యశాల పాత భవనాన్ని గ్రామానికి చెందిన కొర్రపాటి మనోహర్‌నాయుడు ఆక్రమించుకున్నారని గ్రామస్తులు ఆరోపించారు. వారు సోమవారం తహసీల్దార్ ప్రసాద్‌రావుకు ఫిర్యాదు చేశారు. గతంలో గ్రామంలో పశు వైద్యశాల కోసం భవనం నిర్మించారు. అది ప్రస్తుతం ఖాళీగా ఉంది. దాన్ని సమీపంలోనే నివాసం ఉంటున్న మనోహర్ నాయుడు ఆక్రమించుకుని ఇంటి నిర్మాణ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. బాలగురునాథం, వెంకటకృష్ణయ్య, పవన్‌కళ్యాణ్, నాగరాజ, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ భూముల్లో అక్రమ ప్రహరీ తొలగించండి

తాళ్వాయిపాడు గ్రామంలో ఉన్న స్వర్ణముఖి నదీ తీరంలో ఉన్న ప్రభుత్వ సీలింగ్ భూముల్లో అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను తొలగించాలని తహసీల్దార్ ప్రసాద్‌రావు స్థానిక ఆర్‌ఐ సంతోషి నిబాయిని ఆదేశించారు. సర్వే నంబరు 74లో లేఅవుట్ వేసిన రియల్టర్ సమీపంలో ఉన్న సీలింగ్ భూమిని ఆక్రమించుకుని రోడ్డు, ప్రహరీ గోడ ఏర్పాటు చేసుకున్నట్టు తెలిపారు. ఈ విషయంపై గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను వెంటనే తొలగించాలన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతుల వల్ల మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఏఈ హరికృష్ణ తెలిపారు. పట్టణంలోని బాలాజీ గ్రీన్ సిటీ, బీఎంఆర్ నగర్, లోతువానిగుంట, పాత, కొత్త బీడీ కాలనీలు, భూపయ్య ఎస్టీ కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సువార్త ఉజ్జీవ మహాసభలు

వాకాడు : స్థానిక సెయింట్ జేమ్స్ లూథరన్ చర్చి ఆవరణలో సోమవారం సువార్త ఉజ్జీవ మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సభలు మూడు రోజులపాటు జరుగుతాయని సంఘకాపరి రెవరెండ్ ఎస్ ప్రశాంత్‌బాబు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరుకు చెందిన అంతర్జాతీయ సువార్తకులు జ్యోతిరాజు పాల్గొని బైబిల్ సందేశం ఇచ్చారు. అనంతరం స్వస్థత ప్రార్థనలు నిర్వహించారు. జెయింట్ జేమ్స్ చర్చి కమిటీ సభ్యులు దినకర్‌బాబు, అజయ్‌కుమార్, మహిపతి తదితరులు పాల్గొన్నారు.

కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- ఘనంగా అంకురార్పణ
- నేడు ధ్వజారోహణం


అంకురార్పణ పూజలు చేస్తున్న వేదపండితులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణ పరిధిలోని తుమ్మూరులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను సోమవారం రాత్రి అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. టీటీడీకి చెందిన వేద పండితులు ఆలయం వద్ద విష్వక్సేన ఆరాధన, పుణ్యాహ వచనం, పరిషత్ రక్షా బంధనం, మృత్సంగ్రహణం, వాస్తు, హోమ పూజలు చేశారు. రాత్రి స్వామికి ఏకాంత సేవ చేపట్టారు. కార్యక్రమాల్లో టీటీడీ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో కె.సుబ్బరాజు, సూపరింటెండెంట్ డి.శ్రీనివాసులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ హరిరెడ్డి, సుధీర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసంచేసిన వారిని అరెస్టు చేయాలి

వెంకటగిరి రూరల్ : బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు మంగళపూరి సురేష్ మాదిగ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం క్రాస్‌రోడ్డు సమీపంలో ధ్వంసమైన అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత బహుజన పోరాట వేదిక ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ నిందితులను అరెస్టు చేయాలని, లేనిపక్షంలో జూన్ 6వ తేదీన ప్రజా కుల స్వచ్ఛంద సేవా సంస్థలు, అంబేడ్కర్ వాదుల ఆధ్వర్యంలో వెంకటగిరి పట్టణాన్ని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ఏడీపీఎస్ నాయకులు గోపాల్, ఎంఎస్పీ పల్లిపాటి రవి, కంటిపల్లి మణి, ఎమ్మార్పీఎస్ నాయకులు రాజకుమార్, తుపాకుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులకు నోటీసులు

చిల్లకూరు : ఎన్నికల సందర్భంగా జరిగిన అల్లర్లను దృష్టిలో ఉంచుకుని సిట్ అధికారుల ఆదేశాల మేరకు పోలీసులు గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని పెట్రోల్ బంకులకు నోటీసులు జారీ చేశారు. బాటిళ్లలో పెట్రోల్ పట్టరాదని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు

కోట : పోలీసులు సోమవారం కోట క్రాస్ రోడ్డు, విద్యానగర్, రంగన్నగుంట, సిద్ధవరం వద్ద ఉన్న పెట్రోల్ బంకులను తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు క్యాన్లు, బాటిళ్లలో పెట్రోల్ పట్టరాదన్నారు. వాహనాలకు మాత్రమే పెట్రోల్ పట్టాలని ఎస్‌ఐ నాగబాబు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

వైభవంగా యోగ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

దక్కిలి: మండలంలోని వెలుగొండలు కింద (పెద కోన) వెలసిన యోగ లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం చేపట్టారు. సాయంత్రం 4 గంటలకు కలశ స్థాపన, వేదపారాయణం చేపట్టారు. మంగళవారం ఉదయం ఉత్సవమూర్తులకు అభిషేకాలు, రాత్రి 7 గంటలకు గరుడ సేవ నిర్వహిస్తారు. బుధవారం ఉదయం 7 గంటలకు పూర్ణాహుతి, 10 గంటలకు లక్ష్మీనరసింహస్వామి కల్యాణం చేపడతామని ఆలయ నిర్వాహకులు విజయ్‌కుమార్ తెలిపారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసినట్టు వెల్లడించారు.

జూన్ 1న హనుమాన్ శోభాయాత్ర

వెంకటగిరి రూరల్ : హనుమాన్ జయంతి సందర్భంగా జూన్ 1న నిర్వహించనున్న వేడుకల పోస్టర్లను సోమవారం విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఆవిష్కరించారు. విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడు వడ్లమూడి భాస్కర్ మాట్లాడుతూ వైశాఖ శుద్ధ దశమి హనుమాన్ జయంతి సందర్భంగా వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ కళాశాల ప్రాంగణం నుంచి హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. విశ్వహిందూ పరిషత్ ప్రధాన కార్యదర్శి అలిమిలి మల్లికార్జున్, సహాయ కార్యదర్శి సుధాకర్, పురుషోత్తం, ప్రఖండ అధ్యక్షుడు నర్రారవి, నక్కల పోలయ్య పాల్గొన్నారు.

స్కూటరిస్టుకు గాయాలు


గాయపడిన శివరాజా

దక్కిలి: మండలంలోని కమ్మపల్లి దళితవాడ వద్ద సోమవారం ట్రాక్టర్ ఢీకొని స్కూటరిస్టు గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని కమ్మపల్లి దళితవాడకు చెందిన కొప్పల శివరాజా సొంత పని నిమిత్తం బైక్‌లో దక్కిలికి బయలుదేరాడు. దళితవాడ సమీపంలో కమ్మపల్లికి చెందిన గ్రావెల్ లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొంది. శివరాజాకు కాలు విరిగింది. బంధువులు, స్థానికులు అతన్ని దక్కిలి పీహెచ్‌సీకి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తీసుకెళ్లారు. దీనిపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.


స్వామి, అమ్మవార్లను ఊంజల్ సేవ మండపానికి తీసుకువస్తున్న అర్చకులు


స్వామి, అమ్మవార్లకు ఊంజల్‌సేవ చేస్తున్న అర్చకులు


ఆలయంలో పూజలు చేస్తున్న వేద పండితులు


పిల్లలు లేని మహిళలకు కోడిముద్దలు అందజేస్తున్న అర్చకులు


వాహన సేవలో కళాకారుల కోలాటం

భక్తులతో కిటకిటలాడిన పెంచలకోన

పెంచలకోన లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రెండో రోజు సోమవారం ధ్వజారోహణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారిని తిరుచ్చిపై కొలువుదీర్చి ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. రాత్రి ఊంజల్ సేవ కనుల పండువగా నిర్వహించారు. అలాగే రాత్రి 10 గంటలకు స్వామి, అమ్మవార్లు శేష వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. భక్తుల గోవింద నామస్మరణతో పెంచలకోన మారుమోగింది. - రాపూరు